క్లుప్తంగా

రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి


అధికారులతో మాట్లాడుతున్న జేసీ

పాలకోడేరు: గ్రామ సదస్సులలో రెవెన్యూ సమస్యలపై స్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం పాలకోడేరు తహసీల్దార్ కార్యాలయాన్ని జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన ఫిర్యాదులు నిర్ణీత గడువులోగా పరిష్కారానికి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రెవెన్యూ సదస్సులు, రీసర్వే, పీజీఆర్ఎస్ రికార్డులను పరిశీలించారు. పెండింగ్ ఫైల్స్ సంబంధిత కార్యాలయాలకు పంపించాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, జిల్లా సర్వే ఇన్‌చార్జి అధికారి కె.శ్రీనివాస్, తహసీల్దార్ నడింపల్లి భారతీవిజయలక్ష్మి, మండల సర్వేయర్ సీహెచ్ శ్రీనివాస్, డీటీలు, వీఆర్వోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగులో సమగ్ర యాజమాన్యం ముఖ్యం

ఉండి: వరి సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులే ముఖ్యమని ఏడీఏ కేఏఎస్ఎస్ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోని చెరుకువాడలో మండల వ్యవసాయాధికారి బి.సంధ్య ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన రైతులతో ఏడీఏ మాట్లాడుతూ వరిసాగులో ఎరువుల వినియోగం, వరిచేనుకు నీటి సరఫరా అంశాలపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మొదటి దఫా ఎరువులు వేసేటప్పుడు 20 కేజీల ఎంఓపీ వేసుకోవాలని తెలిపారు. ఏఓ సంధ్య మాట్లాడుతూ ఈ–పంట నమోదుపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

పాలిథీన్ కవర్లు వాడొద్దు


పాలిథీన్ కవర్ల నిషేధంపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ జి.కృష్ణమోహన్

ఆకివీడు: పాలిథీన్ వాడకాన్ని ఫిబ్రవరి ఒకటి నుంచి నిషేధించారని నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణమోహన్ చెప్పారు. స్థానిక సంత మార్కెట్‌లో బుధవారం వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మార్కెట్‌లోని దుఖాణాల వద్దకు వెళ్లి వినియోగదారులు సంచులు తెచ్చుకుంటేనే సరుకులు అమ్మాలని, పాలిథీన్ కవర్లు ఇచ్చి సరుకులు అమ్మొద్దని హెచ్చరించారు. నిషేధాన్ని ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నేడు నగర పంచాయతీ సమావేశం

ఆకివీడు: నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం గురువారం కౌన్సిల్ హాలులో నిర్వహించనుందని చైర్‌పర్సన్ జామి హైమావతి బుధవారం తెలిపారు. కౌన్సిల్ సమావేశంలో 2025–26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారని చెప్పారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు హాజరుకావాలని సూచించారు.

హైందవ శంఖారావం విజయవంతానికి కృషి

భీమవరం (ప్రకాశంచౌక్): సమరసత ఫౌండేషన్ ధర్మనిధి సభ్యత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమరసత ఫౌండేషన్ జిల్లా సమావేశం తీర్మానించింది. బుధవారం భీమవరంలోని తాపీ పని వర్గ సంఘం భవనంలో ఫౌండేషన్ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంత సహసంయోజక్ తులసి సూర్య ప్రకాష్ మాట్లాడుతూ గత నెల విజయవాడలో నిర్వహించిన హైందవ శంకరరావు విజయవంతమైందని, ఇందులో ఫౌండేషన్ కీలక పాత్ర పోషించిందని, ఇది ప్రతి ఒక్కరి సమష్టి కృషి అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్ఎస్ఎస్ గోదావరి విభాగం సహకార్యవాహ ఎం .మురళీకృష్ణ, ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ నక్క రామోజీ, జిల్లా మహిళా కన్వీనర్ బోనం వెంకటలక్ష్మి, జిల్లా ధర్మ ప్రచా రక్ ఎం కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

గాంధేయవాదం భావితరాలకు మార్గదర్శకం

కాళ్ల: గాంధేయవాదం భవిష్యత్ తరాలకు మార్గదర్శకమని పద్మశ్రీ డాక్టర్ ఎంఆర్ రాజు అన్నారు. మహాత్మాగాంధీ 77వ వర్ధంతిని పురస్కరించుకుని కాళ్ల మండలం పెదఅమిరం లోని ఎంజీఎం ట్రస్టులో 'గాంధేయం' పుస్తకా విష్కరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. డాక్టర్ ఎంఆర్ రాజు మాట్లాడుతూ సత్యం అహింసా విధానాలే భారతీయ సంస్కృతి, ప్రగతికి మూలం అన్నారు. అనంతరం 12 మంది రచయితలకు గాంధీ పురస్కారాలు అందజేశారు. సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు, మానవతా చైర్మన్ బి.బుద్ధరాజు, కేవీబీ మురళీకృష్ణ, చెరుకువాడ రంగసాయి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య నియమాలే రక్ష

- శీతాకాలంలో విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు
- ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసమే కారణం
- గుండె, ఆస్తమా, మధుమేహంపై జాగ్రత్తలు అవసరం
- పిల్లలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాల్సిన తరుణం
- పంటల పైనా తీవ్ర ప్రభావం


నాగేంద్రపురం వద్ద పొగ మంచులో చిరు వ్యాపారులు


భీమవరం పట్టణంలో రోడ్డు వెంబడి ఉన్ని వస్త్రాలు విక్రయిస్తున్న దుకాణదారులు

భీమవరం అర్బన్: శీతాకాలంలో చలిపులి పంజా విసురుతోంది. వాతావరణంలో అనూహ్య మార్పులు చోటు చేసుకోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. వృద్ధులు, చిన్నారులలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండడంతో తేలికగా సీజనల్ వ్యాధులు చుట్టుముడుతున్నాయి. దీంతో ఆస్పత్రులకు వ్యాధి పీడితుల సంఖ్య పెరుగుతోంది. రోగాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం మేలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. చల్లటి వాతావరణంలో ఎక్కువ సమయం గడపకుండా అప్రమత్తంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు వేకువ జామున, రాత్రి వేళల్లో బయట సంచరించకుండా ఉంటే ఉత్తమం. ప్రధానంగా పిల్లలు, వృద్ధుల ఆరోగ్య పరిరక్షణలో తగు జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. ఏమాత్రం అనారోగ్యం తలెత్తినా వెంటనే వైద్యులకు సంప్రదించాలి. సకాలంలో చికిత్స అందించాలి. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు సైతం మరింత జాగ్రత్తగా ఉండడం మంచిది. శీతాకాలంలో తీసుకోవలసిన చర్యలపై వైద్యులు పలు సూచనలు చేస్తున్నారు.

వ్యాయామం తగ్గించాల్సిందే

ఉదయం పొగ మంచు, ఈదురు గాలులు విజృంభిస్తుంటాయి. దీంతో శ్వాసకోస వ్యాధిగ్రస్తులు ఉక్కిరిబిక్కిరి అవుతంటారు. వ్యాయామం చేసే విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలి. వ్యాయామం పేరుతో గంటల కొద్దీ ఓపెన్ ఎయిర్ గ్రౌండ్స్, పార్కులలో తిరగడం తగ్గించాలి. ఇంట్లో, ఇండోర్ స్టేడియంలో మాత్రమే వ్యాయామం చేయడం మంచిది. అరగంట పాటు సురక్షిత ప్రాంతంలో నడక, ఆటలు కొనసాగించాలి

తస్మాత్ జాగ్రత్త

ప్రస్తుతం ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. చలి తీవ్రత పెరిగే కొద్దీ రక్తనాళాలు సంకోచిస్తాయి. దీంతో అవయవాలకు రక్తప్రసరణ చేసే గుండె మరింత వేగంగా పనిచేయాల్సి ఉంటుంది. ఆక్సిజన్‌తో కూడిన రక్త సరఫరా తగ్గడంతో గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువ. గుండె జబ్బులు, మధుమేహం, అస్తమా వ్యాధిగ్రస్తులకు ఒక విధంగా శీతాకాలం శత్రువే. శరీరం వ్యాధుల బారిన పడేది ఈ సీజన్‌లోనే. ఎప్పుడైనా గుండెలో చిన్న నొప్పిగా అనిపిస్తే వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి వెళ్లి డాక్టర్‌ను సంప్రదించాలి. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న చిన్నారుల విషయంలో జాగ్రత్తలు వహించాలి. ఉదయం, రాత్రి వెళల్లో పిల్లలను బయటకు రానివ్వకుండా చూసుకోవాలి. వయో వృద్ధులు సైతం జాగ్రత్తలు పాటించకుంటే వైరస్ దాడి చేసే ప్రమాదం ఉంది. శీతాకాలంలో పెంపుడు జంతువులకు దూరంగా ఉండడం ఉత్తమం. వైరస్‌ల వ్యాప్తికి పెంపుడు జంతువులు ప్రధాన కారణమని, వైరాలజీ నిపుణులు చెబుతున్నారు. ఈ కాంలో నిద్రగది, వంటగదిలోనికి రానివ్వకుండా అదుపు చేయడం మంచిది. పిల్లలు, వయోవృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు పెంపుడు జంతువుల దరిదాపుల్లోకి కూడా వెళ్లకూడదని వైద్యులు సూచిస్తున్నారు.

ఉన్ని దుస్తులకు పెరిగిన డిమాండ్

చలి తీవ్రత కారణంగా గ్రామాల్లో, పట్టణాల్లో స్వెట్టర్లు, ఉన్ని వస్త్రాలకు డిమాండ్ పెరిగింది. భీమవరం పట్టణం, వీరవాసరం మండలాల్లో రోడ్ల వెంబడి రాజస్థాన్ నుంచి స్టాల్స్ పెట్టి స్వెట్టర్లు, చలికోట్‌లు, జర్కిన్‌లు, మంకీ క్యాప్‌లు, మాస్కులు విక్రయిస్తున్నారు. ఒక్కొక్కటి రూ. 350 నుంచి 800 వరకు చలి దుస్తువుల నాణ్యతను బట్టి విక్రయిస్తున్నారు. జనం కూడా వీటిని కొనుగోలు చేయడానికి మొగ్గుచూపతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



చలికాలంలో ఆరోగ్య వంతులు సైతం వ్యాధుల బారిన పడే ముప్పు ఉంది. గోరు వెచ్చని నీటినే తాగాలి. వ్యాధినిరోధక శక్తిని పెంచే ఆహారం తీసుకోవాలి. ఉదయం, రాత్రి సమయాల్లో ఆరు బయట తిరగడం మానుకోవాలి. తప్పనిసరిగా వెళ్లవలసి వస్తే రక్షణ దుస్తువులు ధరించాలి. మంచులో ప్రయాణం మంచిది కాదు. స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు ధరించాలి. అలర్జీ, జలుబు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఈ కాలంలో వచ్చే అనారోగ్య సమస్యలపై నిర్లక్ష్యం చేయకూడదు.

– ఎ. అరుణరాణి, వైద్యాధికారిని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గొల్లవానితిప్ప

వరిపై ప్రభావం



ప్రస్తుతం కురుస్తున్న పొగ మంచు వల్ల రబీ పంటలో అగ్గితెగులు వ్యాపించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రైతులు ప్రతి రోజు ఉదయం పూట సూర్యోదయం అయ్యాక చేల వద్దకు వెళ్లి పైరుపై ఆశించే తెగులు వ్యాప్తిని పరిశీలించుకోవాలి. లేకుంటే తెగులు వ్యాప్తి ఎక్కువైతే పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

– నిమ్మల శ్రీనివాస్, వ్యవసాయాధికారి, భీమవరం మండలం

కర్ర బొగ్గుతో ఉపాధి మెండు


కర్ర బొగ్గు తయారీ కుంపటి

ఆకివీడు: కర్ర బొగ్గు తయారీ కూడా ఒక కుటీర పరిశ్రమే. దీని తయారీతో ఉపాధి మెండుగా లభిస్తుంది. ఇది ఎంతో నేర్పరితనంగా ఉంటుంది. కర్ర కాల్చితే బొగ్గు, బుగ్గి అవ్వడం సహజం. అయితే బుగ్గి అవ్వకుండా బొగ్గు మాత్రమే తయారయ్యే విధంగా గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యులు తమ మేధస్సుతో కనిపెట్టారు. ఇతర అవసరాలకు బొగ్గును అమ్మి జీవనోపాధి పొందుతున్నారు. బొగ్గు ఇంధనంగా ఉపయోగపడుతుంది. గత కొన్నేళ్లుగా కర్ర బొగ్గు తయారీ విధానం గ్రామాల్లో కొనసాగుతుంది. తుమ్మ, నల్లతుమ్మ, ఇతర ముదిరిన పచ్చి మొక్కల కర్రలను ముక్కలుగా నరికి వాటిని ఇటుక బట్టీలు పేర్చే విధంగా పేర్చి వాటి మధ్యలో కొబ్బరి డొక్కలు, ఇతరత్రా కర్రలను వేసి నిప్పు రాజుకునేందుకు అమర్చుతారు.ఆ విధంగా పేర్చిన కర్రలపై గడ్డిని కప్పి, దానిపై మట్టి ముద్దలను పేర్చి, అలుకుతారు. మంట రాకుండా తడి మట్టిని అద్దుతూ పొగ మాత్రమే వచ్చే విధంగా కర్ర కాలుతూ బొగ్గుగా తయారవుతుంది. కుంపటి మాదిరిగా ఏర్పాటు చేసిన కర్ర బొగ్గు తయారీ బట్టీ చూడటానికి పలువురిని ఆకట్టుకుంటుంది. అయితే ఇది తేగల కుంపటిగానో, మరే ఇతర అవసరాలకో పెట్టినట్లుగా భావిస్తారు. ఉపయోగంలేని మొక్క లు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో వీటిని అధికంగా తయారు చేస్తున్నారు. పశ్చిమగోదావరి, కృష్ణా, ఏలూరు జిల్లాల సరిహద్దులోని పలు మండలాల్లో కర్ర బొగ్గు తయారీ కేంద్రాలున్నాయి.

చిరు వర్తకులకు ఉపయోగం

కర్ర బొగ్గు చిరు వ్యాపారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కర్ర బొగ్గును బట్టలు ఇస్త్రీ చేసుకునే ఐరన్ బాక్సుల్లో వాడుతున్నారు. మొక్కజొన్న పొత్తులు కాల్చడానికి, ముగ్గు తయారీలో గుల్ల కాల్చడానికి, ఇతరత్రా అవసరాలకు వాడుకుంటున్నారు. కర్రబొగ్గు ఇతర వ్యాపారులకు ఆదాయాన్ని కల్పిస్తుంది. సంచుల లెక్కన తయారీదారుల వద్ద కర్ర బొగ్గును కొని, అమ్ముతున్నారు. పలు కర్రల అడితిల వద్ద, పుల్ల అడితిల వద్ద వీటిని కొనుగోలు చేస్తున్నారు. హోల్‌సేల్‌గా బస్తా రూ.400 నుంచి రూ.500 వరకు ధర పలుకుతుంది. అయితే రిటైల్‌గా కిలో రూ.80 నుంచి రూ.100 వరకూ విక్రయిస్తున్నారు. తమ సొంత నైపుణ్యంతో కర్ర బొగ్గును తయారు చేస్తున్న వారికి చేయూతనివ్వాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

పాల ఉత్పత్తి పెంపుతోనే రైతులకు లాభం


పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ కఠారి జయలక్ష్మి, సర్పంచ్ నందమూరి ప్రకాశం, డీడీ హుస్సేన్

ఆకివీడు: పాల ఉత్పత్తి పెంపుతోనే పాడి రైతులకు లాభదాయకమని ఎంపీపీ కఠారి జయలక్ష్మి, సర్పంచ్ నందమూరి ప్రకాశం అన్నారు. మండలంలోని చెరుకుమిల్లిలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రైతులకు చేదోడు వాదోడుగా ఉన్న పాడి పరిశ్రమను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పాల ఉత్పత్తి పెంపుకు మేలుజాతి పశువులను సబ్సిడీపై రైతులకు అందజేయాలని డిమాండ్ చేశారు. డీడీ హుస్సేన్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 48 వేల ఆవులు, 84 వేల గేదెలు, 29 వేల గొర్రెలు, మేకలు ఉన్నాయని చెప్పారు. డెల్టా ప్రాంతంలో కోళ్ల పెంపకం అధికంగా ఉందన్నారు. కోళ్లకు ముందు జాగ్రత్త చర్యలుగా వ్యాక్సిన్లు వేయించాలని సూచించారు. మినీ గోకులంలో 2,4,6, గేదెలు, ఆవులను 90 శాతం సబ్సిడీపై అందజేసేందుకు 40 యూనిట్లు మంజూరయ్యాయని చెప్పారు. పశుగ్రాసం అభివృద్ధికి 70 శాతం సబ్సిడీపై షెడ్లు నిర్మించేందుకు మహాత్మా గాంధీ పథకం అందుబాటులో ఉందని చెప్పారు. వెటర్నరీ వైద్యు రాలు కెల్లా భార్గవీసత్య సేవలను అభినందిస్తూ ఎంపీపీ, సర్పంచ్ డీడీలు సత్కరించారు. అనంతరం లేగ దూడల ప్రదర్శనలో ఆరోగ్యవంతమైన లేగ దూడలను ఎంపిక చేసి డీడీ బహుమతులు అందజేశారు.

రైతులు ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలి


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్

భీమవరం అర్బన్: వరినాట్లు పూర్తైన అనంతరం రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని తాడేరు, బేతపూడి గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో వరినాట్లు 90 శాతం పైగా పూర్తయ్యాయన్నారు. వరినారి దొరకని రైతులు వెదజల్లే పద్ధతిని అనుసరించాలన్నారు. ఈ విధానం వల్ల పంట రెండు వారాలు ముందుగాను, రూ. 3 వేలు నుంచి 5 వేలకు పైగా ఖర్చు ఆదా అవుతుందన్నారు. సుమారు 5 వేల ఎకరాలకు సంబంధించి రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకున్నారన్నారు. మిగిలిన రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. సాగులో ఎరువుల యాజమాన్యం పాటించి ఖర్చులు తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. రైతులకు వచ్చిన పలు సందేహాలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్, రైతులు పాల్గొన్నారు.

పంపన సాయిబాబుకు సత్కారం


పంపన సాయిబాబును సత్కరిస్తున్న దృశ్యం

వీరవాసరం: మహాత్మా గాంధీ 77వ వర్ధంతి సందర్భంగా జిల్లా స్థాయిలో జిల్లాసర్వోదయ మండలిలో కవిత రచనల పోటీలు నిర్వహించారు. ఈ కవితా పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచిన వీరవాసరం మద్దాల రామకృష్ణమ్మ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు పంపన సాయిబాబును పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎమ్మార్ రాజు మహాత్మాగాంధీ స్మారక పురస్కారంతో బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పంపన సాయిబాబు మాట్లాడుతూ జనగణమన పాడుదాం, జాతిని జాగృతం చేద్దాం, కాశ్మీరానికి కిరీటం పెడదాం, కన్యాకుమారికి కాళ్లు కడుగుదాం, ఆకలి తీర్చే అన్నదాతలను ఆదుకుందాం, ఉగ్రవాదానికి ఉరివేద్దాం, చేయి చేయికలుపుదాం, సోమరితనాన్ని వదులుదాం, కష్టపడి పని చేద్దాం అప్పుడే మనది గాంధేయం–గాంధీ యుగం అవుతుందన్నారు. ఈ సందర్భంగా పంపన సాయిబాబును ఎం.ఆర్.కె.జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జుత్తిగశ్రీనివాసు, పాఠశాల సిబ్బంది మండలంలో పలువురు ప్రముఖులు ఉపాధ్యాయులు వారికి అభినందనలు తెలిపారు.

అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

వీరవాసరం: గ్రామాల పురోభివృద్ధికి ప్రజాప్రతినిధులు అంతా ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఎంపీడీవో రవి కిరణ్ తెలిపారు. వీరవాసరం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామపంచాయతీ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగంగా శిక్షణ తరగతులను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025– 2026 సంవత్సరానికి సంబంధించిన అభివృద్ధి ప్రణాళికలను గ్రామ సభల ద్వారా ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు కలిసి రూపొందించుకోవాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా గ్రామంలో జరిగే 23 డిపార్టుమెంట్ల ద్వారా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించుకుంటూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. గ్రామపంచాయతీలకు వచ్చే నిధులు, ఖర్చులు, ఇతర విషయాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని, వైస్ ఎంపీపీ అద్దాల శ్రీరామచంద్ర మూర్తి, ఏపీఎం కే జ్యోతి రాణి, సర్పంచులు గెద్దం భారతి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించడం తప్పనిసరి


భీమవరం ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ నారాయణమూర్తి

భీమవరం: జాతీయ రహదారి భద్రాతా మాసోత్సవాలు సందర్భంగా బుధవారం ట్రాఫిక్ పోలీస్, విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో భీమవరం పట్టణంలోని ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ వీకే జే ప్రసూన అధ్యక్షత వహించగా ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి నారాయణమూర్తి మాట్లాడుతూ ద్విచక్ర వాహనాల డ్రైవింగ్‌లో అతివేగం, హెల్మెట్. ధరించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగి ఎక్కువ శాతం మరణాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్య స్థానాలకు చేరాలన్నారు. విజ్ఞాన వేదిక సేవా సంస్థ అధ్యక్షుడు అల్లుశ్రీనివాస్, అరసవల్లి ఈశ్వరమ్మ వీర వెంకటాచారి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వాహనాలను నడిపే వారంతా సామాజిక బాధ్యతతో మెలగాలన్నారు. ట్రాఫిక్ ఏఎస్ఐ సత్యనారాయణ, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కాకుమాని శ్రీనివాసరావు, అధ్యాపకులు పి రాజశేఖర్, అరవిందస్వామి, ఎల్ నర్సింహారావు, పి అమూల్యరావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమవరం: పట్టణంలోని సూర్యనారాయణపురం ప్రాంతానికి చెందిన కలిదిండి రామకృష్ణంరాజు (64) అనారోగ్యంతో బుధవారం మృతి చెందినట్లు టుటౌన్ ఎస్ఐ రహమాన్ చెప్పారు. రామకృష్ణంరాజుకు మతిస్థిమితం లేకపోవడంతో ఈనెల 4వ తేది నుంచి ఇంటి నుంచి బయటకు వచ్చాడు. అయితే ఈనెల 20వ తేదిన అనారోగ్యంతో పడిపోవడంతో చుట్టుపక్కలవారు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందగా మృతుని కుమారుడు అశోక్‌వర్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రహమాన్ తెలిపారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడికి ఉత్తమ అవార్డు

ఉండి: గణపవరంలో నిర్వహించిన లయన్స్ క్లబ్ జోనల్ శాంతి సమావేశంలో ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్తి బ్రహ్మారెడ్డికి ఉత్తమ అవార్డు లభించింది. దీంతో పాటు ఉండి లయన్స్ క్లబ్‌కు మరిన్ని అవార్డులు లభించాయి. గత ఏడాది ఉత్తమ సేవలు అందించినందుకు బ్రహ్మారెడ్డికి బెస్ట్ ప్రెసిడెంట్, బెస్ట్ సెక్రటరీగా ముదునూరి శివరామరాజు, బెస్ట్ ట్రెజరర్‌గా పాలతీర్థపు నర్సింగరావుకు అవార్డులు దక్కాయి. లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ రామ్మూర్తి చేతుల మీదుగా అవార్డులను అందజేశారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఉన్నతంగా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు బ్రహ్మారెడ్డి తెలిపారు. క్లబ్ అడ్మిస్ట్రేటర్ రుద్రరాజు నరసరాజు, ఉపాధ్యక్షుడు గాదిరాజు రంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బస్‌స్టాండ్‌ను పరిశీలించిన ఆర్ఎం

ఆకివీడు: స్థానిక బస్ స్టాండ్‌లోకి అన్ని బస్సులు వచ్చి వెళ్లాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఎన్వీఆర్ వరప్రసాద్ ఆదేశించారు. స్థానిక బస్ స్టాండ్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ బస్‌స్టాండ్ ఆవరణలో పిచ్చిమొక్కలు, ఇతరత్రా వ్యర్థాలను తొలగించాలని సూచించారు. బస్‌స్టాండ్ ప్రాంతంలో ఒక ఉద్యోగిని ఏర్పాటు చేయాలని వస్తున్న బస్సులు, వెళుతున్న బస్సుల వివరాలను తెలియజేయాలన్నారు. పిచ్చి మొక్కల తొలగింపునకు నగర పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది సహకారాన్ని తీసుకోవాలని సూచించారు.

హామీలు అమలు చేయండి


భీమవరంలో పేదలకు ఇళ్లస్థలాల కోసం సీపీఐ ఆధ్వర్యంలో అర్జీలు స్వీకరిస్తున్న దృశ్యం

భీమవరం: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలపై ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పేదల నుంచి ఇండ్ల స్థలాల కోసం అర్జీలు స్వీకరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంపై విమర్శలు చేసిన కూటమి నాయకులు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటిస్థలం ఇచ్చి ఇళ్లు నిర్మిస్తామన్న హామీ ఏమైందని రంగారావు ప్రశ్నించారు. వెంటనే ఇళ్ల స్థలాలు పంపిణీ చేపట్టకపోతే ప్రజలతో కలిసి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. సీపీఐ జిల్లా నాయకులు వై.వీ.ఆనంద్, ఎం లక్ష్మీపతి, పాలా దాసు తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎం జిల్లా ఇన్‌చార్జిగా బండి మధు


బండి మధు

ఉండి: అంబేడ్కర్స్ ఇండియా మిషన్ (ఏఐఎం) జిల్లా ఇన్‌చార్జిగా ఉండి మండలం ఉణుదుర్రు శివారు సాగుపాడుకు చెందిన న్యాయవాది బండి మధు నియామకమైనట్లు బుధవారం పత్రికా ప్రకటనలో ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి జి.సుందర్‌కుమార్, యండగండి గ్రామ సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెలగపల్లి టోనీ, గొంతే హరీష్, తదితరులు అభినందనలు తెలిపారు.

అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

పాలకోడేరు: మండల పరిషత్ సమావేశ మందిరంలో అధ్యక్షుడు భూపతిరాజు సత్యనారాయణరాజు అధ్యక్షతన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రాథమిక, మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళికపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి పాలకోడేరు మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు హాజరయ్యారు. ఎంపీడీవో వి.రెడ్డియ్య మాట్లాడుతూ మండల స్థాయిలో గ్రామ పంచాయతీ, మండల అభివృద్ధికి సంబంధించి మెరుగైన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాలంటే పరిపూర్ణమైన ప్రణాళికలను రచించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రాంప్రసాద్, సంబంధిత మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

నిషేధిత మందులు విక్రయిస్తే చర్యలు

భీమవరం అర్బన్: రొయ్యలు, చేపలు పెంపకానికి నిషేధిత యాంటీబయోటిక్స్ విక్రయిస్తే దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేసి యజమానులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మత్స్యశాఖాధికారి ఆర్‌వీఎస్‌వీ ప్రసాద్ హెచ్చరించారు. భీమవరం మండలంలో ఆక్వా మందుల షాపులపై బుధవారం జిల్లా మత్స్యశాఖాధికారి ఆర్‌వీఎస్‌వీ ప్రసాద్, టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖాధికారి ఆర్‌వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఆక్వా పెంపకంలో యాంటీబయోటిక్స్ వాడకం నిషేధమన్నారు. నిషేధిత యాంటీబయోటిక్స్ విక్రయించడం నేరమన్నారు. ఆక్వా మందుల విక్రయిస్తున్న దుకాణదారులు తప్పకుండా ఆంధ్రప్రదేశ్ ఆక్వా కల్చర్ అథారిటీ అప్సడా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. జిల్లా మత్స్యశాఖాధికారి ఆర్‌వీఎస్‌వీ ప్రసాద్ వెంట మత్స్యశాఖ ఏడీ సీహెచ్ వేంకటేశ్వరరావు, మండల ఫిషరీస్ డవలప్‌మెంట్ అధికారిని పి.లావణ్య, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పి.మల్లిఖార్జునరావు, బి.నూకేష్, వీఎఫ్ఏ సుజాత ఉన్నారు.